# ఊహాల లోగిలి

పార్వతమ్మ మనసు పరుగులు పెడుతున్నది. ఇన్నాళ్ళకు తన కోరికతీరబోతున్నది. తన పిల్లల చిన్నతనంలో వాళ్ళ ముద్దు మురిపాలు చూడటానికి,చూసి ఆనందించటానికి టైం వుండేదేకాదు.

అత్తగారి ఆలనా, పాలనా, ఆడపడుచుల రాకపోకలు, వచ్చిపోయే చుట్టు, పక్కాలు, స్నేహితులు అబ్బబ్బ....ఒకటేమిటి, నిత్యకల్యాణం, పచ్చతోరణం అన్నట్లుండేది ఇల్లు. అత్తగారు పోయాక కూతురు సీత పెళ్ళి చేశారు. అల్లుడు ఎక్కడో డెహ్రాడూన్‌లో పెద్ద ఆఫీసరు. వియ్యాలవారి రాకపోకలు, మంచి మర్యాదలు జరుగుతుండగానే కొడుకు శేఖర్ బి. యి. ప్యాసై పై చదువులకు అమెరికా వెళ్ళాడు. అక్కడ చదువు పూర్తి చేసి, ఉద్యోగం సంపాయించుకుని, అమెరికాలో పెరిగిన ఆంధ్రుల అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు, ఆమధ్య ఇండియా వచ్చినప్పుడు.

"అమ్మా! ఇదే ఆఖరు నేను ఇక్కడికి రావటం. మరో ఆర్నెల్లల్లో నువ్వు బామ్మవి కాబోతున్నావు. అందుచేత నాన్నగారు, నువ్వు అక్కడికి వచ్చి మనవడి మంచి చెడ్డలు చూడాలి" అన్నాడు. పిచ్చి సన్యాసి, వాడు ఆ మాట అని కూడా ఆరేళ్ళయింది. పుట్టిన మనవడు పెద్దవాడయి, వచ్చీరాని మాటల్తో "బామ్మా ఎప్పుడు వత్తావో?" అంటూ ఫోన్లో మాట్లాడాడు.

"ఏమిటి పార్వతమ్మా! అంత దీర్ఘాలోచన" అంటూ కళ్ళజోడు సవరించుకుని భార్య దగ్గరగా రాబోయారు రావుగారు.

"చాల్లెండి. రేపు మనవలముందు, మన వరాళ్ళముందు ఈ పరాచికాలు, చిలిపి చేష్టలు తగ్గించండి. చిన్న పిల్లాడిలా ఏమిటిది."

"చిన్న పిల్లాడినే! రేపటినుంచి అమ్మగారు పెట్టిన అన్నం తిని బుద్ధిగా...." నాలిక్కరుచుకున్నారు రావుగారు.

"ఏమిటండోయ్! ఏదో కొత్త ప్లాను వెస్తున్నట్లున్నారు. ఇహ ఆ పప్పులేం వుడకవ్ నాదగ్గర. ఇదిగో సామాను, రెండు ట్రంకు పెట్టెలు, ఈ పెద్ద బెడ్డింగు ఆ నాలుగు వి. ఐ. పి. సూట్ కేసులు, రెండు బ్యాగులు, మూడు బుట్టలు, నా హ్యాండు బ్యాగు, మరచెంబు, ఇంతవరకు సర్దాను....మిగిలినవి రేపు సర్దుతాను. రేపు మంచిరోజయితే ఎంత బాగుండేది. తీరా చవితి అయింది. ఏమిటో....పిల్లల్ని చూడకుండా ఇన్నాళ్ళు ఎట్లా వున్నానో....ఇహ నావల్లకాదు బాబూ!"

నిట్టూర్చింది పార్వతమ్మ. నిజమే! పిల్లల్ని చూడాలని ఏ తల్లి మనసు తహతహలాడదు గనుక!

"ఇవిగోనోయ్! మన పిల్లలదగ్గర్నుంచి ఉత్తరాలు వచ్చినయ్ అమ్మాయిఏం రాసిందంటే అల్లుడు రష్యా వెళుతున్నాట్ట. చూసి రావటానికి తనూ వెళుతున్నదట. అందుచేత తిరిగి రాగానే మళ్ళీ ఉత్తరం రాస్తాను" అని రాసింది. "ఇహపోతే...."

"అబ్బా ఏం రాశాడండీ!?" ఆత్రుతగా అడిగింది.

"వుండు....వుండు....వస్తున్నా, అక్కడికే వస్తున్నా...."

"ఏమిటండీ! మీరు మరీను. ఆ వుత్తరంలో ముక్క నా చెవున పడెయ్యటానికి ఇంతహంగామా చేస్తున్నారు" విసుగ్గా అన్నది పార్వతమ్మ.

"హంగామా కాదు. సంగతి పెద్దది. వివరంగా చెప్పాలికదా?"

"ఆ! చాల్లెండి సంబడం. ఏమిటా వూరింపు."

"వూరింపుకాదే, వున్నమాట. అబ్బాయి ఏం రాశాడంటే-"

"తనే ఓ ఆరు నెలల్లో ఇక్కడికి వచ్చి ఇల్లు, వాకిలి, పొలం పుట్రా అమ్మేసి, అంతా అమెరికన్ కరెన్సీ చేసి, అప్పుడు మనిద్దర్నీ తీసుకు వెళతాట్ట."

"అంటే....అంటే...."

"అదేనే! అబ్బాయి వుద్దేశ్యం మనమే వాళ్ళ దగ్గరవున్నప్పుడు మన కంటూ ఇంకా ఏమీ అక్కర్లేదని." దీర్ఘం తీశారు రావుగారు.

పార్వతమ్మ మనసు చివుక్కుమన్నది. "ఏమిటో ఇల్లూ, పొలం అమ్మేస్తాడా? ఇప్పుడంత అవసరం ఏమొచ్చిందండీ!"

"పిచ్చి పార్వతీ! ఈ ఇల్లు, నేల, గాలి మన జీవితాలతోటి, మన మంచి చెడ్డలతోటి పెనవేసుకున్న బంధాలు. పిల్లలు వాళ్ళ మనుగడను, వ్యక్తిత్వాన్ని అక్కడ పెంచుకున్నారే!"

పార్వతమ్మకు రావుగారి మాటలు అర్థం కానూ లేదు. రుచించనూలేదు. అందుకే ఆ సంభాషణ పొడిగించటం ఇష్టం లేక డైనింగు టేబులువైపు నడిచింది.

అన్నిరోజుల్లాగా ఆ రోజూ అన్నాలు తిని పడుకున్నా ఎవరి ఆలోచన్లు వాళ్ళను నిద్రకు దూరం చేసినయ్!

పార్వతమ్మ మనసు బాల్యంలోకి తొంగి చూస్తే, రావుగారి ఊహాలు భవిష్యత్తు వైపు



కొండముది రుక్మిణీదేవి

పరుగులు తీసినయ్!

తను పుట్టి పెరిగింది చిన్న పల్లెటూరు. ఊహాలు, ఆలోచన్లు, కోరికలు లేకుండానే, అంటే పదహారేళ్ళు నిండకుండానే ఈ ఇంటి కోడలయింది. మరో రెండేళ్ళకు కాపరానికి రావటం, ఉద్యోగరీత్యా అనేక వూళ్ళు తిరుగుతుంటే కొంతమంది పరిచయస్తులుగానూ, కొంతమంది స్నేహితులుగాను చాలా కొద్దిమంది ఆత్మీయులుగానూ మిగిలారు. అలాగే రావుగారు అంచెలంచెలుగా పైకివచ్చి, .ఆస్తి, అంతస్థు, నలుగుర్లోనూ మంచితనం పెంచుకున్నారు. గడచిన కాలంలో కొన్నాళ్ళు పెద్దవాళ్ళను గురించి, అంటేరావుగారి తల్లి దండ్రుల్ని గురించి, తన తల్లిని గురించి ఆలోచించి వాళ్ళ పద్ధతులకు అనుగుణంగా, తాము సర్దుకున్నారు. ఆ తరువాత, పిల్లలు పెద్దవాళ్ళవుతుంటే వాళ్ళ అభిమతానికి, అనుగుణంగా, తమ ఆలోచన్లు, కోర్కెలు మలుచుకుని వాళ్ళ భవిష్యత్తుకు బాటలు వేశారు. ఇహ....ఇహ....ఇప్పుడు కొడుకురాసిన ఉత్తరం మనసులో మెదిలే సరికి, ఒక్క క్షణం అనుభవరాహిత్యంగానూ, ఆలోచనా శూన్యంగామూ తోచింది పార్వతమ్మకు.

రావుగారి మస్తిష్కం మబ్బు విడిచిన వెన్నెలలాగ, విరబూచిన మల్లెపొదలాగా, అంబరావ సంధించినట్లున్న హరివిల్లులాగా, అవును అలాగావుంది.




తమది మధ్యతరగతి కుటుంబం తండ్రి తనమ కష్టపడి చదివించాడు. ఏడాదికి ఒకసారి చేతికొచ్చేపంట డబ్బు మినహా పై సంపాదనంటూ ఏమీవుండేదికాదు. అందులోనే అన్నయ్య, తను, తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు చదువులు, నిత్యకృత్యాలు, బంధువులరాకపోకలు ఒకటేమిటి? ఒక్కొక్క సంవత్సరం ప్రకృతి కరుణించకపోతే, ఆ వచ్చే ఆదాయం కాస్తకూడా రాకపోతే, అప్పులు చెయ్యటం. అవి తీరేసరికి మరొక ఖర్చు! ఇలాంటి పరిస్థితిలో తన కోరికల్నిగాని, అభిరుచుల్నిగాని, తండ్రి దగ్గర చెప్పటానికి జంకుగానే వుండేది.

ఒకసారి మనసు నిలుపుకోలేక తన దగ్గరున్న పెన్సిలుతోనే రాధాకృష్ణ బొమ్మగీసి, డ్రాయింగు టీచరుకు చూపిస్తే ఆయన ఎంతగానో మెచ్చుకుని, మర్నాడు కనబడ్డ తన తండ్రితో అంటే.

“వాడ్ని ఓ అక్షరం ముక్క చదువుకోనివ్వండి. ఈ బొమ్మలు బొరుసులు అన్నం పెడతయ్యా! దయచేసి వాడ్ని ప్రోత్సహించకండి” అన్నారుట.

తరవాత ఎప్పుడో తనకా విషయం తెలిసింది. అయినా తండ్రి తత్వమూ, ఇంట్లో పరిస్థితులు తెలుసుగనక చదువు మీదే శ్రద్ధ చూపాడు. ఉద్యోగంలో చేరిన కొత్తలో



కుంచె, రంగులు కొనుక్కొచ్చి, స్టాండుమీద కాన్వాసు అమరుస్తుండగా రెండేళ్ళ కూతురు సీతవచ్చి ఆరంగులన్నీ ఇంటి నిండా పారబోసి, వంటినిండా చేసుకున్నది. అప్పుడే అక్కడకువచ్చిన పార్వతి “అసలే పనికాక చస్తుంటే ఈరంగులేమిటీ?! అయినా నిన్నని ఏం లాభం. ఇన్నాళ్ళకి మీ నాన్నకి కలిగిన కోరికని అనాలిగాని.”

“ఏమండీ! ఇప్పుడే ఉద్యోగంలో చేరారు. మనదంటు ఓ కుటుంబం ఏర్పడుతున్నది. మనమూ, మన పిల్లలు సుఖంగా వుండాలంటే ఈ వయసులోనే మీరు కష్టపడి నాలుగు డబ్బులు వెనకేసుకోవాలి. అంతేగాని, ఈ రంగులు, కుంచెలు పెట్టుక్కూర్చుంటే....”

ఆమె మాట పూర్తి చెయ్యకుండానే, తను కాన్వాసు మడిచి, బ్రష్షు శుభ్రంచేసి, పెట్లో అడుగున పెట్టేశాడు. అంతే మళ్ళీ వాటిని గురించిన ప్రస్తావన రాలేదు. ఎంతో డబ్బు సంపాయించాడు. పిల్లల అవసరాలు, భార్య కోరికలు, తల్లి దండ్రుల ఆలనా పాలనా, ఇలా అన్నీ - తనకు తెలిసినంతవరకు ఎవరికి ఏలోటురానివ్వలేదు.

తనకు ప్రమోషన్ వచ్చినప్పుడల్లా ఓ మీటింగు పెట్టి దండవేసి, ఇంకాపైకి వెళ్ళాలని నాలుగు చిలక పలుకులు పలికేవాళ్ళు.



# మోడల్ గర్ల్‌గా స్టెఫీగ్రాఫ్

టెన్నిస్ ప్రపంచాన్ని ఒక ఊపు ఊపిన నెంబర్ వన్ క్రీడాకారిణి స్టెఫీగ్రాఫ్ యిప్పుడు 'మోడలింగ్' ప్రపంచంలోకి అడుగిడ బోతోంది.

ఈత దుస్తులు, కురచ దుస్తులను ఉత్పత్తి చేసే సంస్థ ఒకటి తమ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు స్టెఫీని మోడల్‌గా ఎన్నుకుందట. వాణిజ్య ప్రకటనల్లో స్టెఫీ దర్శన భాగ్యాన్ని కల్పించ వలసిందిగా అనేకమంది కోరుతున్నారని ఆమె తండ్రి తెలియ జేస్తున్నాడు. ఆమె నగ్న చిత్రానికి 7 లక్షల 50 వేల పౌండ్లు యిస్తామని 'ప్లేబాయ్' పత్రిక ముందుకు వచ్చిందట. ఇందుకు కూడా ఆమె తండ్రి గ్రీన్ సిగ్నల్ యిస్తున్నాడట కూతురి గుర్తింపుకోసం. 'అడిడాస్' క్రీడా దుస్తులకు మోడల్‌గా వున్న స్టెఫీని తమ సంస్థ తరఫున కూడా మోడలింగ్ గర్ల్‌గా కాంట్రాక్టు కుదుర్చు కునేందుకు అనేక సంస్థలు పోటీ పడుతున్నాయట. టెన్నిస్ కంటే మోడలింగ్ ప్రపంచమే గిట్టుబాటేమో! స్టెఫీ లాంటి అప్సరసలకు.

## ఊహాల లోగిళ్ళు...

ఇకముందు ఆ అవకాశమూలేదు. ఈ సమాజమూ, మనుషులు, ముఖ్యంగా తన కుటుంబంలో వాళ్ళూ కళని గురించిగాని, తన ఆవేదనను గురించిగాని, కళపట్ల తనకున్న మమకారాన్ని గురించిగాని ఏనాడూ పట్టించుకోలేదు. తనకు ఆ అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు....ఇప్పుడు తనే ఆ వూహాల లోగిళ్ళలోకి అడుగు పెట్టాలి.

ప్రకృతిలోని ప్రతి కదలికకూ, ఆకృతి నివ్వాలి. ఆ అందాల్ని అజరామరం చేసి, ముందుతరాలకు అందివ్వాలి. ఆయనలోని కళాదృష్టి కళ్ళు తెరిచింది. కళాతృష్ణ కదం తొక్కింది. ముందు జీవితాన్ని కళామయం చేసుకోవాలన్న కోరిక పురివిప్పి నాట్యం చేసింది. ఆలోచనల్లోంచి, అంతరంగ మథనం లోనుంచి పక్కకు తిరిగి పార్వతమ్మ వైపు చూశారు రావుగారు.

"ఏమండీ! నిద్రపట్టటం లేదా?" మెల్లగా అడిగిందామె.

"పార్వతీ! నా కోరిక తీరుస్తావా? నాకు తోడుగా నిలుస్తావా?" బేలగా అడిగాడాయన.

"అవేం మాటలండీ! జీవితంలో ఎప్పుడైనా మీ మాటకు ఎదురు చెప్పానా? ఏ విషయంలోనైనా వేరొక ఆలోచన చేశామా?"

"అదే పార్వతీ! అదే నా ధైర్యం. గతించిన కాలం కన్నా, ముందున్న భవిష్యత్తు గొప్పది. రేపటినుంచి నాకు ఉద్యోగ బాధ్యతల్లేవు. పై వాళ్ళ మెప్పులు, కిందివాళ్ళ పొగడ్తలు అసలే వుండవు. అందుకే నేను నేనుగా వుండటానికి నిశ్చయించుకున్నాను. నాకాన్వాసు, కుంచె నా ఊహాలకు ఆలంబన. ఏది ఆ పెట్టె తాళం తీయి."

"ఇప్పుడేమిటండీ!?"

"అదిగో! తొలికోడి కూసింది. తెల తెలవారుతున్నది. ఆ తూరుపురేఖల వెలుగుల్ని మన జీవితాల్లో ప్రసరింపచేసుకుందాం. ఈ తొలికోడి కూతల్లో భవిష్యత్తుకు మేలుకొలుపులు పాడుకుందాం! ఆ సప్తాశ్వరథారూఢుణ్ని రంగుల్లో ముంచిన కుంచెతో ప్రతిబింబిస్తాను."

అయన ఆలోచన్లకు అంతే వాసిగా ఆమె లేచింది. ఆయన ఊహాలకు రూపకల్పనగా, ఆమె మంచందిగింది. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఆమె ఆ పెట్టెమూత తీసింది.

[*]